బతుకమ్మకు ప్రపంచవ్యాప్త గుర్తింపు



బతుకమ్మకు పూజలు చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే


వాంకిడి, న్యూస్‌టుడే: పండగలను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనం ఆవరణలో జిల్లా శిశు, మహిళా, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖాధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలను జిల్లా అదనపు పాలనాధికారులు దీపక్ తివారీ, దాసరి వేణులతో కలిసి ప్రారంభించారు. ముందుగా శారదాదేవి ప్రతిమలకు పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర పండగ బతుకమ్మకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా నిర్వహించుకుంటూ భావితరాలకు అందించాలని పేర్కొన్నారు. అనంతరం మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమాధికారి భాస్కర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

దీపాలకు రూ. కోట్లు.. అక్రమాల చీకట్లు


- ఇప్పటికే 'హైమాస్ట్'లకు రూ.5 కోట్ల చెల్లింపులు
- మరో రూ.2 కోట్ల ప్రతిపాదనలు

ఈనాడు, ఆసిఫాబాద్

ఎల్ఈడీ దీపాలు అమర్చడంలో భారీ స్థాయిలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇందులో గుత్తేదారుకు రూ.కోట్లలో మిగిల్చుకున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ రూ.కోట్ల విలువైన ఎల్ఈడీ దీపాల పనుల కోసం ఓ నేత ప్రతిపాదనలు పంపడం.. జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. రూ.వేలల్లో ఉండే వీటి కోసం రూ.లక్షలు కేటాయించి అధికారులు అవకతవకలకు తెరతీశారు. గత సంవత్సరం చేసిన ఈ పనులపై అనేక వివాదాలు చుట్టుముట్టడంతో బిల్లుల చెల్లింపులు నిలిపేశారు. తాజాగా ఈ నిధులు ఇవ్వడం గమనార్హం. మళ్లీ సీఎస్ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత) నిధులు రూ.2 కోట్లు మంజూరు కాగా.. వీటిని సైతం ఈ దీపాల కోసమే ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లుగా సమాచారం.



జిల్లాలోని పట్టణాల ముఖ్య కూడళ్లలో, మండల కేంద్రాల్లో ఎల్ఈడీ దీపాలు అమర్చారు. ఒక్కో యూనిట్‌కు డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్) నుంచి రూ.2 లక్షలు ఖర్చు చేశారు. వాస్తవంగా ఈ యూనిట్ ఖర్చు రూ.84 వేలకు మించదు. వందలాది స్తంభాలు పెడెస్టల్ (కింది భాగంలో స్తంభం చుట్టూ సిమెంటు, కంకర నిర్మాణం) చేయకుండానే నిలబెట్టారు. దీని విలువ దాదాపుగా రూ.12 వేల వరకు ఉంటుంది. పొరుగున ఉన్న మంచిర్యాల జిల్లాలో ఒక్కో దీపానికి రూ.75 వేలు ఖర్చు చేస్తే కుమురం భీం జిల్లాలో మాత్రం రూ.2 లక్షల చొప్పున వెచ్చించడం గమనార్హం. బిగించినవి సైతం చాలా చోట్ల వెలగకపోగా.. కొన్ని ప్రాంతాల్లో జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసి, నిధుల దుబారాకు తెరతీశారు.



ఫిర్యాదు చేసినా..

ఆయా మండలాల ఎంపీడీఓల ఆధ్వర్యంలో డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు కాగా.. పంచాయతీరాజ్ శాఖ అధికారులు పనులు పర్యవేక్షించారు. ఎస్‌డీఎఫ్ నిధులు సైతం హైమాస్ట్ కోసమే ఖర్చు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా దీపాల కోసం నిధులు ఖర్చు చేశారని, భారీ స్థాయిలో అవినీతి జరిగిందని మే నెలలో ఓ నేత కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. విచారణ నిమిత్తం జిల్లా పంచాయతీ అధికారిని నియమించారు. ఇప్పటి వరకు ఎలాంటి నివేదిక రాలేదని సమాచారం. తదనంతరం పనులకు సంబంధించిన బిల్లులన్నీ చెల్లించడం గమనార్హం.


ఇదీ లెక్క..

12 మీటర్ల స్తంభానికి రూ.33 వేలు, 200 వాట్స్ ఫ్లడ్ లైట్స్ 6 బిగిస్తే రూ.24 వేలు (కొన్ని చోట్ల నాలుగే ఫ్లడ్ లైట్స్ బిగించారు), తవ్వడానికి రూ.20 వేలు, సెన్సార్లు రూ.4500, ఇతర తీగల కోసం రూ.2500, మొత్తం రూ.84 వేలకు ఒక్కో హైమాస్ట్ దీపం కోసం ఖర్చు చేయాలి. ఇందుకు భిన్నంగా జిల్లాలో ఒక్కో యూనిట్ కోసం రూ.2 లక్షల చొప్పున ఖర్చు చేశారు. రూ.కోట్ల పనులన్నీ రూ.2 లక్షల మేర విభజించి పూర్తిగా నామినేషన్ విధానంలో నేతల అనుచరులు చేపట్టారు. ఈ అంశంపై సమగ్ర విచారణ చేస్తే రూ.కోట్ల కుంభకోణం బయటపడుతుందని ప్రజలు అంటున్నారు.

సైబర్ వల.. కాసుల కాజేత

- ఆన్‌లైన్ షాపింగ్‌లో అప్రమత్తత అవసరం

☛ మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ యువకుడికి ఆన్‌లైన్‌లో ఓ ప్రముఖ కంపెనీ నుంచి చరవాణులపై 40 శాతం ఆఫర్లు ఉన్నాయంటూ సందేశం వచ్చింది. దీంతో ఆ యువకుడు కంపెనీ పంపిన వివరాలకు అనుగుణంగా బ్యాంకు ఖాతా ద్వారా రూ.35 వేలు పంపించాడు. వారం రోజులు గడిచినా తనకు ఎలాంటి పార్సిల్ రాకపోవడంతో సంస్థ చూపిన చరవాణికి నంబరుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తాను మోసపోయానని తెరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



☛ ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం దేగామకు చెందిన ఉదయ్ ఓ చరవాణి ఆర్డర్ చేయగా మంగళవారం మధ్యాహ్నం డెలివరీ బాయ్ వచ్చి అందించాడు. అతడి సమక్షంలో తెరిచి చూడగా రాళ్లు, సబ్బు బిళ్ల వచ్చాయి.



మంచిర్యాల నేరవిభాగం, చెన్నూరు, న్యూస్‌టుడే:

కొద్దిరోజుల్లో బతుకమ్మ, దసరా, దీపావళి పండగలు రానున్నాయి. పండగలంటే నూతన వస్త్రాలు, అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని సైబర్ నేరగాళ్లు ప్రజలకు ఆఫర్ల పేరుతో వల వేయనున్నారు. ఆకట్టుకునే ప్రకటనలకు ఆశపడితే మొదటికే మోసపోయే ప్రమాదం లేకపోలేదు. అనవసరపు లింక్‌లకు క్లిక్ చేస్తే మనం తేరుకునే లోపే ఖాతాలు ఖాళీ అవుతాయి.

పండగ పూట.. పారాహుషార్

ఉమ్మడి జిల్లాలో సగటున సాధారణ రోజుల్లో సుమారు రూ.25 లక్షల వరకు ఆన్‌లైన్ వ్యాపారం జరుగుతుంది. పండగ వేళ రోజుకు ఇది రూ.50 లక్షల వరకు జరుగుతుంది. ఈ సమయంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, తదితర సామాజిక మాధ్యమాల్లో ఆఫర్ల పేరుతో ప్రకటనలు పంపిస్తారు. చరవాణులు, దుస్తులు, చేతిగడియారాలు, తదితర అలంకరణ వస్తువుల లోగోలను పంపి మార్కెట్ ధర కంటే 30 నుంచి 50 శాతం వరకు తగ్గింపు ధరలకు ఇస్తామంటూ మాయ చేస్తారు. ఆన్‌లైన్‌లో ఉండగానే వస్తువు కొనుగోలు చేయాలని సమయం మించిపోతుందని తొందరపెడతారు. అలాగని మన బ్యాంకు ఖాతా వివరాలు పంపిస్తే డబ్బులు మాయమవుతాయి. మంచిర్యాల జిల్లాలో జనవరి 1 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు 122 సైబర్‌క్రైం కేసులు నమోదయ్యాయి.

తక్కువ ధరలంటే నమ్మవద్దు

సైబర్ మోసగాళ్లు భారీ ఆఫర్లు ఇస్తామని చెప్పి యాప్‌ల ద్వారా ప్రకటనలు ఇస్తారు. మార్కెట్‌లో రూ.లక్షకుపైగా ఉన్న చరవాణులపై 75 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తామని ప్రచారం చేస్తారు. వీటిని నమ్మి మోసపోవద్దు. నమ్మకమైన వెబ్‌సైట్‌ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. డెలివరీ సమయంలో వీడియో రికార్డు చేసి ఉంచుకోవాలి.

1930 టోల్‌ఫ్రీ నంబరు

సైబర్‌క్రైం పోలీసుల దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేసేలోపే నేరగాళ్లు డబ్బును ఖాతాల నుంచి లాగేసుకుంటున్నారు. ఖాతా నుంచి డబ్బు పోయినట్లు గుర్తించగానే కేంద్రహోంశాఖ హెల్ప్‌లైన్ నంబరు 1930కు ఫిర్యాదు చేయాలి.

ఓటు హక్కు నమోదుకు ప్రత్యేక కౌంటర్లు

రెబ్బెన, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన వారు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పి.రామ్మోహన్‌రావు సూచించారు. బుధవారం ఓటరు నమోదు దరఖాస్తు ఫారాన్ని తహసీల్దార్ స్వీకరించారు. పట్టభద్రుల ఓటు కోసం దరఖాస్తు ఫారం-18, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓటు కోసం దరఖాస్తు ఫారం-19 ద్వారా ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకోసం తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 63 దరఖాస్తులు వచ్చాయన్నారు. 2021 నవంబరు లోపు డిగ్రీ ఉత్తీర్ణులైన వారు పట్టభద్రులు, స్కూల్ అసిస్టెంట్, జూనియర్ లెక్చరర్, యుడైస్‌లో నమోదైన పాఠశాల ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల కోసం వచ్చే నెల 6వ తేదీ లోపు ఆన్‌లైన్ లేదా నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

సరస్వతీ నమస్తుభ్యం..



కాగజ్‌నగర్ వాసవీమాత ఆలయంలో.. శ్రీ సరస్వతీ దేవిగా

దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కాగజ్‌నగర్‌లోని వాసవీమాత ఆలయంలో సరస్వతీ దేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా తమ పిల్లలు చదువుల్లో రాణించాలని తల్లిదండ్రులు ప్రత్యేక పూజలు, అక్షరాభ్యాసాలు చేయించారు.

- న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం

17న కుమురం సూరు వర్ధంతి

వాంకిడి, న్యూస్‌టుడే: కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఈ నెల 17న నిర్వహించే కుమురం సూరు వర్ధంతిని విజయవంతం చేయాలని కుమురం సూరు ఉత్సవ కమిటీ ఛైర్మన్ మడావి రాజు, కన్వీనర్ మారుతిలు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో వర్ధంతి గోడ ప్రతులను ఆవిష్కరించారు. జిల్లాలోని నలుమూలల నుంచి ఆదివాసీలు పాల్గొనాలని కోరారు. నాయకులు సిడాం ధర్ము, టేకం మానిక్‌రావు, ఆత్రం రాజు, ఆత్రం లక్ష్మణ్, టేకం గంగారాం పాల్గొన్నారు.

పండగల వేళ.. పస్తులు తప్పవా..

- వేతనాలు లేక చిరుద్యోగుల వెతలు..

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

నెల జీతం తప్ప ఇతర ఏ ఆదాయం లేని వారు ఒక్క నెల ఆలస్యమైతే తట్టుకోలేరు. అలాంటిది నెలల తరబడి జీతాలు రాని వారి పరిస్థితి అగమ్యగోచరమే. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కార్మికులు, చిరు ఉద్యోగులు పండగల వేళ పస్తులుండాల్సి దుస్థితి నెలకొందని ఆవేదనకు గురవుతున్నారు. ఇటీవల వారంతా జిల్లా అధికారులకు కలిసి తమ గోడు వెల్లడిసుకుంటున్నారు.

జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల్లో దినసరి, పొరుగు సేవలు, పార్ట్‌టైం, పారిశుద్ధ్య, ఎన్ఎంఆర్. ఇలా వివిధ విధానాల్లో ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. నెలకు వారికి వచ్చే వేతనాలు ఒక్కో శాఖలో ఒక్కోవిధంగా రూ.10,500 నుంచి రూ.16 వేల వరకు ఉంటుంది. వీరిలో ఎవరికీ ప్రతి నెలా వచ్చే పరిస్థితి లేదు. మూడు, ఆరు నెలలకోసారి చెల్లిస్తుంటారు. పది నెలలైనా రాని వారున్నారు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని వాపోతున్నారు.



వేతనాలు చెల్లించాలని పుర కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

గిరిజన సంక్షేమ శాఖలో..

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 51 ఆశ్రమ, శాటిలైట్ పాఠశాలల్లో పార్ట్‌టైం, దినసరి, పారిశుద్ధ్యం.. ఇలా వివిధ కేటగిరీల్లో 360 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో నెలకు రూ.10,200 నుంచి రూ.11,200 వరకు వేతనాలు పొందుతున్నారు. నెలకు రూ.కోటి వరకు నిధులు అవసరం. నాలుగు నెలలుగా వేతనాలు లేక వారంతా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే శాఖలో పొరుగు సేవల విధానంలో 50 మంది ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.22 వేల వేతనం ఉంది. మూడు నెలలుగా రావడంలేదు.

బీసీ సంక్షేమ శాఖలో..

బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో పొరుగు సేవల విధానంలో.. కామాటి, కుక్, వాచ్‌మెన్‌లుగా 12 మంది పని చేస్తున్నారు. నెలకు రూ.15,600 వేతనం. వీరికి గతేడాది డిసెంబరు నుంచి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో 10మంది పనిచేస్తుండగా.. రూ.11,580 నుంచి రూ.13,260 వరకు వేతనాలు పొందుతున్నారు. ఆరు నెలలుగా రాని పరిస్థితి.

ఎస్సీ సంక్షేమ..

ఎస్సీ సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న పది ప్రీ, పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో 22 మంది కుక్, కామాటి, వాచ్‌మెన్‌లుగా పొరుగు సేవల విధానంలో పని చేస్తున్నారు. నెలకు రూ.10 వేల నుంచి రూ.15,600 వరకు వేతనాలు పొందుతుంటారు. నెలకు రూ.2.90 లక్షలు అవసరం. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు బిల్లులు చేసి ఖజానా కార్యాలయంలో అందించారు. కానీ ఇప్పటి వరకు జీతాలు తీసుకోలేదు.

పురపాలికలో..

ఆసిఫాబాద్ పురపాలికలో పనిచేస్తున్న కార్మికులకు సైతం నెల నెలా వేతనాలు రావడం లేదు. ఇక్కడ దినసరి, ఎన్ఎంఆర్, మల్టీపర్పస్ వర్కర్లుగా మొత్తం 142 మంది పనిచేస్తున్నారు. నెలకు రూ.7,500 నుంచి రూ.27 వేల వరకు జీతాలు పొందుతున్నారు. వీరి వేతనాల కోసం నెలకు రూ.13 లక్షలు అవసరం. మూడు నెలలుగా జీతాలు లేక తరచూ ఆందోళన బాట పడుతున్నారు. ధర్నా చేసినప్పుడు అధికారులు ఒక నెల ఇచ్చి మమ అనిపిస్తున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి

వాంకిడి, న్యూస్‌టుడే: జిల్లాలో పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు పాలనాధికారి దాసరి వేణు, కాటన్ కార్పొరేషన్, వ్యవసాయ, మార్కెటింగ్, విద్యుత్తు, అగ్నిమాపక, రవాణా, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు, జిన్నింగు మిల్లుల యజమానులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 3.30 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారని, 23 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని 17 జిన్నింగు మిల్లులలో కొనుగోలు కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521లు నిర్ణయించిందని తెలిపారు. అగ్నిమాపక, విద్యుత్తు, తూనికల కొలతల శాఖల అధికారులు ఆయా జిన్నింగు మిల్లులను పరిశీలించి సౌకర్యాలు, ఏర్పాట్లపై నివేదికను అందించాలని ఆదేశించారు. జిన్నింగు మిల్లు యజమానులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి రక్షణ చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ జరిగేలా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియ పూర్తయిన మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి అష్మద్, పత్తి కొనుగోలు కేంద్రాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పత్తి ధర.. కాకూడదు దగా

- ఇప్పుడే చక్రం తిప్పుతున్న వ్యాపారులు

ఈటీవీ - ఆదిలాబాద్


ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 10.15 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా.. 71.05 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని మార్కెటింగ్‌శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర రూ.7521గా నిర్ణయించింది. ప్రస్తుతం ప్రైవేటులో రూ.7,700 పైచిలుకు ధర పలుకుతోంది. ఒకవేళ ఇదే ధర కొనసాగితే భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోళ్లు చేస్తుందా? లేదా? అనేది ప్రశ్నార్థకమే. సీసీఐ పోటీ లేకపోతే నాణ్యత, తేమ పేరిట రైతులకు నష్టం జరిగే అవకాశం ఉంది. ఆదిలాబాద్, భైంసా, జైనూర్, ఆసిఫాబాద్ ప్రాంతాల్లో సిండికేట్‌గా ఉన్న కొందరు ప్రైవేటు వ్యాపారులు ఇప్పటికే సీసీఐ పాత్రను పరిమితం చేయటం కోసం ప్రయత్నాలు చేస్తున్నందునే కొనుగోళ్ల ముహూర్తం ఖరారు కాలేదని తెలుస్తోంది.



ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డు

సీసీఐ పాత్ర ఏమిటి?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీసీఐ రెండు విధాలుగా పత్తి కొనుగోళ్లు చేయడానికి వెసులుబాటుంది. మొదటిది బహిరంగ మార్కెట్లో మద్దతు ధర కంటే తక్కువ ధరతో వ్యాపారులు కొనుగోళ్లు చేస్తుంటే సీసీఐ రంగంలోకి దిగాలి. ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోళ్లు చేస్తూ రైతులు నష్టపోకుండా చూడాలి. రెండోది ప్రైవేటు వ్యక్తులతో పోటీ పడి కొనుగోళ్లు చేయటం. వ్యాపారులు ఏకమైతే సీసీఐ వల్ల రైతుకు న్యాయం జరుగుతుంది. కానీ ఆ సంస్థ ఇప్పుడు రంగంలో ఉంటుందా? లేదా? అనేది అనుమానాలకు తావిస్తోంది.



నేతలతో సమాలోచన

దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భైంసా వ్యవసాయ మార్కెట్‌యార్డుల పరిధిలోనే అత్యధికంగా పత్తి అమ్మకానికి వస్తోంది. మంచిర్యాల జిల్లాలో చివరిస్థానంలో నిలుస్తోంది. ధర నిర్ణయంలో వ్యాపారుల మాట చెల్లుబాటవుతోంది. ఆదిలాబాద్, భైంసా, ఆసిఫాబాద్‌లో కొంతమంది నేతలతో వ్యాపారులు అంతర్గత సమాలోచనలు చేయటం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఒకవేళ నేతలు ఒత్తిడి చేస్తే ఇప్పటికే కొనుగోళ్ల ముహూర్తం ఖరారయ్యేది. కానీ అలా జరగటం లేదు. పత్తి వ్యాపారంలో చక్రం తిప్పడంలో అనుభవం కలిగిన భైంసాకు చెందిన కొందరు నేతల పాత్ర కీలకంగా ఉన్నట్లు వ్యాపార వర్గాల ద్వారా తెలియవచ్చింది. ఆదిలాబాద్ లాంటి ప్రాంతాల్లో కొనుగోళ్ల ముహూర్తం ఖరారు కాకపోవటం అనుమానాలకు తావిస్తోంది. అఖిలపక్ష నేతలను మినహాయిస్తే ప్రజాప్రతినిధులెవరూ పత్తి కొనుగోళ్లపై ఆసక్తి చూపకపోవటం విమర్శలకు తావిస్తోంది

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సర్వేపై సమీక్ష



అధికారులతో సమావేశమైన జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

రెబ్బెన, న్యూస్‌టుడే: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్-2020 పథకంలో అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తుల రికార్డులను సరిచూసి క్షేత్రస్థాయిలో సదరు ప్లాట్ల భౌగోళిక స్థితిని పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎల్ఆర్ఎస్ కోసం 7,698 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. నిషేధిత, ప్రభుత్వ భూముల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లినప్పుడు దరఖాస్తుదారుడికి సమాచారం అందించి దరఖాస్తు సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించాలని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి తదుపరి కార్యాచరణకు రికార్డు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 80085 73635
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే

? మండలంలోని ఈజ్‌గాం పంచాయతీ పరిధి పంచశీలనగర్‌లో రేయింబవళ్లు వీధిదీపాలు వెలుగుతున్నాయి. పంచాయతీకి విద్యుత్తు బిల్లుల భారం పడుతోంది. **- యాదగిరి గౌడ్, స్థానికుడు**

✔ మండలంలోని అన్ని పంచాయతీల్లో వీధి దీపాలకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. **-రమేష్, ఎంపీడీఓ కాగజ్‌నగర్**

? మండలంలోని రాస్పెల్లి పంచాయతీ గెర్రెగూడ గ్రామంలోని కాలనీలకు మురుగు కాలువలు లేనందున అపరిశుభ్రత నెలకొంది. **- సీహెచ్ లింగయ్య, స్థానికుడు**

✔ పలు గ్రామాల్లో మురుగు కాలువల నిర్మాణాలకు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం. **- రమేష్, ఎంపీడీఓ కాగజ్‌నగర్**

(సిర్పూర్(టి), న్యూస్‌టుడే)

? డోర్‌పల్లి గ్రామంలో వీధిదీపాలు లేక అవస్థలు పడుతున్నాం. వెంటనే ఏర్పాటు చేయండి **- వెంకటేష్, డోర్‌పల్లి గ్రామస్థుడు**

✔ రెండు రోజుల్లో ఏర్పాటు చేయిస్తాం **- ప్రైమా భాను, డోర్‌పల్లి పంచాయతీ కార్యదర్శి**


గోడప్రతులు విడుదల చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశైలం

ఉద్యమకారులను గుర్తించాలని డిమాండ్

రెబ్బెన, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశైలం, రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండ్రా రాజేశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాదయాత్రకు సంబంధించిన గోడప్రతులు ఆవిష్కరించారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటినా ఉద్యమకారులకు గుర్తింపులేదని, భారాస ప్రభుత్వం తమను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఈ క్రమంలోనే ఉద్యమకారులందరూ కలిసి పాదయాత్ర ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉద్యమకారులు పార్టీలకు అతీతంగా పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రతి జిల్లాలో భవనం నిర్మించాలన్నారు. అమరులైన 1,250 కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల జిల్లా అధ్యక్షుడు పెందూరి ధర్మ, గౌరవాధ్యక్షుడు డా. రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోయిన్, నాయకులు రవీందర్, లక్ష్మణ్, వసంతరావు, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

రాయితీ బియ్యం పట్టివేత

సిర్పూర్(టి), న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 49 క్వింటాళ్ల రాయితీ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ పోచయ్య, సిబ్బంది తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన హుడ్కిలి గ్రామం వద్ద బుధవారం ఉదయం 4 గంటలకు తనిఖీలు నిర్వహించామన్నారు. కాగజ్‌నగర్ నుంచి మహారాష్ట్రలోని అన్నూర్ గ్రామానికి వాహనంలో తరలిస్తున్న 49 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వాహన చోదకుడు కాగజ్‌నగర్‌కు చెందిన సల్మాన్ హుస్సేన్‌ను విచారించారు. కాగజ్‌నగర్‌కు చెందిన ఎండీ శంషీద్ కొంత కాలంగా బియ్యం దందా చేస్తున్నట్లు తేలిందన్నారు. ఈమేరకు దర్యాప్తు చేస్తున్నామని, బియ్యాన్ని కాగజ్‌నగర్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

వాంకిడిలో ఇసుక ట్రాక్టర్లు..

వాంకిడి, న్యూస్‌టుడే: మండలంలోని ఖనర్‌గాం వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం మైనింగ్ ఏడీ గంగాధర్‌రావు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఖమాన సమీపంలో తనిఖీలు చేపట్టగా ఇసుకను తరలిస్తూ రెండు ట్రాక్టర్లు పట్టుబడ్డాయని తెలిపారు. వాటిని తహసీల్దార్‌కు అప్పజెప్పామని విచారణ చేపట్టి చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జూద స్థావరంపై పోలీసుల దాడి

దహెగాం, న్యూస్‌టుడే : మండలంలోని బీబ్రా గ్రామంలో బుధవారం ఎస్సై కందూరి రాజు ఆధ్వర్యంలో జూద స్థావరంపై దాడి చేపట్టారు. ముందస్తు సమాచారం మేరకు గ్రామానికి వెళ్లి సోదాలు నిర్వహించామన్నారు. జూదం ఆడుతున్న అంజయ్య, మనోజ్, వెంకటిలను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.400 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. మరికొంత మంది పరారయ్యారని చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


విలేజ నం.4 మధ్యలో కల్వర్టు లేని ఒర్రె నుంచి వస్తున్న మహిళలు


కల్వర్టు నిర్మాణానికి దశాబ్దాల కిందట వేసిన శిలాఫలకం (వృత్తంలో)

శిలాఫలకం వేసి 39 ఏళ్లు..

మండలంలోని బసంతినగర్ పంచాయతీ పరిధి విలేజి నం.4 గ్రామం మధ్యలోని ఒర్రెపై దశాబ్దాలుగా కల్వర్టు నిర్మాణానికి నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల సందర్భాల్లో కల్వర్టు నిర్మాణాలకు నాయకుల హామీ ఇవ్వడం ఆ తర్వాత పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. 1985 అసెంబ్లీ ఎన్నికలకు ముందు నాయకుల హామీ ఇవ్వడమే కాకుండా అప్పట్లోనే కల్వర్టు నిర్మాణానికి శిలాఫలకం కూడా వేశారు. మూడు దశాబ్దాలు దాటినప్పటికీ హామీ నెరవేరకపోవడం నాయకుల పట్టింపు లేనితనానికి నిదర్శనం. శిలాఫలకం చుట్టూ మొలచిన మొక్కలు నేడు చెట్లుగా మారగా.. శిలాఫలకం శిథిలావస్థకు చేరుతోంది. ఈ గ్రామంలోని ఒర్రెకు అవతల ఉన్న కుటుంబాలు రవాణా సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. 108 అంబులెన్స్ సైతం రాలేని దుస్థితి. వర్షాకాలంలో ఒర్రె ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో.. రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం

అక్షరాభ్యాసాలు.. ప్రత్యేక పూజలు

కాగజ్‌నగర్(గ్రామీణం, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రులు పురస్కరించుకొని.. కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ ఏరియా శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో బుధవారం చండీయాగం నిర్వహించారు. అమ్మవారు సరస్వతీదేవి రూపంలో దర్శనమిచ్చింది. తెదేపా ఆదిలాబాద్ పార్లమెంట్ మాజీ అధ్యక్ష దంపతులు గుల్లపల్లి ఆనంద్‌లావణ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఉత్సవాల నిర్వహణ కమిటీ ప్రతినిధులు కట్ట ప్రసాద్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ఇందిరానగర్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకుడు దేవర వినోద్

దహెగాం: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో చండీయాగం నిర్వహించారు. ఏడో రోజు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, హోమంలో పాల్గొన్నారు.

రెబ్బెన: ఇందిరానగర్‌లోని శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో బుధవారం మహా సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. వివిధ మండలాల నుంచి భక్తులు తమ పిల్లలకు అమ్మవారి సన్నిధిలో అర్చకుడు దేవర వినోద్‌తో అక్షరాభ్యాసం చేయించారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్యామ్‌నాయక్, కోనేరు ట్రస్టు ఛైర్మన్ కోనేరు వంశీ, రుక్మిణి కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడి బియ్యం, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

గోలేటి టౌన్‌షిప్: గోలేటి సింగరేణి సీహెచ్‌పీలోని అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం హోమం, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని జీఎం శ్రీనివాస్, ఏఐటీయూసీ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఏరియా ఇంజినీర్ భీమ్‌రావుతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు దర్శించుకున్నారు.


దహెగాంలో.. చండీయాగం

వాంకిడి: ఆసిఫాబాద్ పొట్టి శ్రీరాములు చౌక్ శారదా మండలిలో భక్తులు కుంకుమార్చనలు నిర్వహించారు. మహేష్ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. మండలి కమిటీ సభ్యులు అమర్థ్య, సాయి చరణ్, ప్రవీణ్ గుప్తా, సురేష్, నవీన్, రాకేష్, జగదీష్, నితీష్, దాసరి రాజు, రాజేష్‌లు పాల్గొన్నారు.


గోలేటి సీహెచ్‌పీలో..


కాగజ్‌నగర్‌లో..


ఆసిఫాబాద్‌లో కుంకుమ పూజలు..

రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా ఉపాధ్యాయులకు చోటు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాదులో 7, 8 తేదీల్లో నిర్వహించిన పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా ఉపాధ్యాయులకు చోటు దక్కిందని బుధవారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఏటుకూరి శ్రీనివాస్‌రావు, అనిల్‌కుమార్‌లు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గంలో కుమురంభీం జిల్లాకు చెందిన పర్ష చంద్రశేఖర్, వరలక్ష్మి, అనురాధ, సునీత, వెంకటేశ్వర్లు, ఇందారపు ప్రకాష్, గుల్లపల్లి రవిశంకర్, కళా రమేష్, ముంజంపల్లి రమేష్, అరుంధతి, బాలునాయక్, మడావి హనుమంత్, మరియాల ఉదయబాబు, దెబ్బటి సత్యనారాయణ, రవిచంద్రారెడ్డి, తాటికొండ ప్రవీణ్, గాజుల రవీందర్, చంద్రశేఖర్, జాడి దేవాజీ, గొల్లపల్లి సంపత్, రాజేంద్రప్రసాద్, దొంతి రాజు, వేణుగోపాల్, శేక్ జావెద్, చెన్నూరు ప్రకాష్‌లకు చోటు దక్కిందని అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

వర్షాల కోసం గ్రామ దేవతలకు పూజలు

కాగజ్‌నగర్ గ్రామీణం: వర్షాలు కురవాలని మండలంలోని మోసం గ్రామంలో బుధవారం మహిళలు గ్రామ దేవతలకు పూజలు చేశారు. వానలు లేక పంటలు ఎండుముఖం పడుతున్నాయని, పూత, కాత దశలోని పత్తి, దిగువ ఆయకట్టులోని వరి పొలాలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. మామిళ్లవాగు నుంచి బిందెలతో గంగాజలం తీసుకొచ్చి ఆంజనేయస్వామి, పోచమ్మ దేవర, భీమన్న దేవతలకు జలాభిషేకం చేశారు.

రైతు ఇంట.. బంతిపూల పండగ

బెజ్జూరు, న్యూస్‌టుడే :

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం గడిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. బెజ్జూరు మండలం హేటిగూడ గ్రామానికి చెందిన యువ రైతు దంపతులు వడాయి పోశన్న-నీలాబాయి. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూనే తనకున్న 30 గుంటల భూమిలో బంతిపూల సాగు చేపట్టి పండగల సమయంలో విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. బెల్లంపల్లిలో బంధువులు సాగు చేస్తున్న బంతి తోటను చూసి స్ఫూర్తి పొందిన ఆయన సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో రెండేళ్ల నుంచి సాగుకు ఉపక్రమించారు. కరీంనగర్ నుంచి ఒక్కో మొక్క రూ.5.25లతో సుమారు 3వేల మొక్కలు నాటారు. రూ.25 వేల పెట్టుబడితో సుమారు 10 క్వింటాళ్ల పూలు చేతికొస్తున్నాయి. ప్రస్తుతం బతుకమ్మ, దుర్గామాత పండగల నేపథ్యంలో కిలోకు రూ.150-200లు పలుకుతుండటంతో మంచి లాభాలు వస్తున్నాయని చెబుతున్నారు.


బంతి పూలు కోస్తున్న దంపతులు పోశన్న-నీలాబాయి



విక్రయించేందుకు సిద్ధంగా బంతి, సీతజడ పూలు

రెండున్నర నెలల్లోనే ఆదాయం

30 గుంటల భూమిలో రైతు పోశన్న జులైలో బంతి సాగు చేయగా.. సెప్టెంబరు ఆఖరు వారం నుంచి పూలు చేతికొస్తున్నాయన్నారు. సాగుకు ఎక్కువ నీరు అవసరం ఉండదని చెబుతున్నారు. రెండున్నర నెలల్లో సుమారు రూ.2 లక్షల ఆదాయం గడించవచ్చని పేర్కొంటున్నారు. తోటలో బంతితోపాటు సీత జడ పూలు సాగు చేస్తున్నారు. బతుకమ్మ, దుర్గామాత, గణపతి పూజలకు, సట్టి బోనాలు, ఇతర పండగలకు, పూజలకు బంతిపూలకు గిరాకీ ఎక్కువ ఉంటోందన్నారు. బెజ్జూరుతో పాటు ఇంటి వద్దనే పూలను విక్రయిస్తున్నారు. బెజ్జూరు, చింతలమానేపల్లి, పెంచికల్‌పేట్ మండలాలతో పాటు మహారాష్ట్రలోని అహెరి గ్రామం నుంచి వినియోగదారులు వచ్చి తీసుకెళ్తున్నట్లు చెప్పారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కౌటాల, న్యూస్‌టుడే : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కాగజ్‌నగర్ సబ్ కలెక్టరు శ్రద్ధ శుక్ల హెచ్చరించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె తనిఖీ నిర్వహించారు. పాత తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించి భవన పరిస్థితిని పూర్తి నివేదికతో అందించాలని అధికారులకు సూచించారు. రిజిస్టర్లను పరిశీలించి సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థుల ధ్రువపత్రాలను సకాలంలో అందించాలని పేర్కొన్నారు. తహసీల్దార్ పుష్పలత, తదితరులు వెంట ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టరు శ్రద్ధ శుక్ల

కల్వర్టులకు మరమ్మతులు

ఈనాడు స్పందనకు వందనం


బోకడగూడ సమీపంలో..


జైరాంగూడ సమీపంలో..

కెరమెరి, న్యూస్‌టుడే : మండలంలోని బోకడగూడ, జైరాంగూడ సమీపంలోని కల్వర్టుకు అధికారులు మరమ్మతులు చేయించారు. ఈ నెల 5వ తేదీన 'ఈనాడు'లో 'ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకోరా.' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు కల్వర్టుల వద్ద మట్టి పోయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గర్భిణులు, చిన్నారులకు టీకాలు తప్పనిసరి

వాంకిడి, న్యూస్‌టుడే: గర్భిణులు, చిన్నారులకు టీకాలు సకాలంలో తప్పనిసరిగా వేయించాలని ఆరోగ్య విస్తరణాధికారి రవిదాస్ సూచించారు. బుధవారం బెండార ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహిస్తున్న టీకాల పంపిణీని పరిశీలించారు. టీకాలతో క్షయ, ధనుర్వాతం, కోరింతదగ్గు రాకుండా కాపాడుతాయని వివరించారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది సుచరిత, వసంత తదితరులు పాల్గొన్నారు.


టీకాల పంపిణీ పరిశీలిస్తున్న ఆరోగ్య విస్తరణాధికారి రవిదాస్

సమావేశమై.. సమస్యలు ఆలకించి!

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: మండలంలోని మొర్లిగూడ, కమ్మర్గాం గ్రామాల్లో ప్రత్యేక అధికారి ప్రభాకర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మొర్లిగూడ గ్రామస్థులు అధికారుల దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. మొర్లిగూడ నుంచి పెంచికల్‌పేట్, గుండెపల్లి నుంచి ఏటిగూడ వరకు రోడ్లు నిర్మించాలని, చరవాణి టవర్, పోడు భూములకు లోన్లు, ఆరోగ్య కేంద్రం, అంతర్గత రోడ్లు, కల్వర్టులు, తదితర సమస్యలు వివరించారు. రోడ్ల మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. అనంతరం కమ్మర్గాం గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలోనూ గ్రామస్థులు అధికారులకు సమస్యలు విన్నవించారు. రోడ్ల సౌకర్యం, పింఛన్లు, మంచి నీటి బోరు బావులు, అంగన్‌వాడీ కేంద్రం మరమ్మతులు, వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు, తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లగా.. అంగన్‌వాడీ కేంద్ర మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. మంచి నీటి బావి పనుల ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్, ఎఫ్ఆర్‌వో అనిల్ కుమార్, మిషన్ భగీరథ డీఈ పృధ్వీ, ఇరిగేషన్ డీఈ భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ప్రభాకర్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బెజ్జూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2010-11 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు.. ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. 14 ఏళ్ల తర్వాత విద్యార్థులందరూ ఒకే చోట కలుసుకుని సంతోషంగా గడిపారు. ఆత్మీయ పలకరింపులు, చిన్ననాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి వీడ్కోలు చెప్పుకొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన డీఎస్సీ అభ్యర్థులు

వాంకిడి, న్యూస్‌టుడే: డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు బుధవారం ఉదయం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. జిల్లా నుంచి స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలకు ఎంపికైన 341 మంది అభ్యర్థులను జిల్లా విద్యాశాఖాధికారులు ఆర్టీసీ బస్సులు, ప్రత్యేక బృందాల పర్యవేక్షణలో తరలించారు. జిల్లా నుంచి ఏడు బస్సులను ఏర్పాటు చేయగా.. కలెక్టరేట్ నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరాయి. మధ్యాహ్నం ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో అభ్యర్థులు పాల్గొన్నారు. నియామక పత్రాలు స్వీకరించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఉదయ్‌బాబు, కటకం మధుకర్, ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.


అభ్యర్థికి నియామక పత్రం అందజేస్తున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి

రైతులకు అండగా ఉండి సేవలందిస్తాం

దహెగాం, న్యూస్‌టుడే : రైతులకు అండగా ఉండి సేవలందిస్తామని మార్కెట్ కమిటీ ఛైర్మన్ సిద్దాల దేవయ్య అన్నారు. బుధవారం చిన్నఅయినం సమీపంలోని గిడ్డంగులను పరిశీలించి మాట్లాడారు. ముందుగా మండల కేంద్రానికి వచ్చిన ఆయనను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీరామారావు, వెంకటేష్, సంతోష్‌గౌడ్, తోగేష్, కృష్ణ, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు బహుమతులివ్వాలి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: దసరా ముందు రోజు సింగరేణి యాజమాన్యం కార్మికులకు విందు భోజనాలు ఏర్పాటు చేయకుండా బహుమతులు ఇవ్వాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి సోమారం తిరుపతి పేర్కొన్నారు. గోలేటిలో మాట్లాడుతూ.. కార్మికులంతా పండగ రోజు కుటుంబ సభ్యులతో పాటు బంధువులతో గడపాలని కోరుకుంటున్నారనానరు. యాజమాన్యం పునరాలోచించి విందులకు అయ్యే ఖర్చులతో ప్రతి కార్మికుడికి పండగ కానుకగా బహుమతులు ఇవ్వాలని కోరారు.

విందు ఏర్పాటు చేయడంపై హర్షం

గోలేటి టౌన్‌షిప్: సింగరేణి ఉద్యోగులకు యాజమాన్యం విందు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించడం సంతోషకరమని ఐఎన్టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర కమిటీ సభ్యుడు సంగెం ప్రకాష్‌రావు అన్నారు. ఇందుకు కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, మినిమం వేజెస్ బోర్డు ఛైర్మన్ జనక్‌ప్రసాద్, సీఎండీ బలరాంకు కృతజ్ఞతలు తెలిపారు.

అధిక ధరలకు మాంసం విక్రయించొద్దు

కౌటాల: అధిక ధరలకు మాంసం విక్రయాలు జరపొద్దని ఎస్సై మధుకర్ దుకాణాల నిర్వాహకులకు సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సంబంధిత యజమానులతో సమావేశమై సూచనలు చేశారు. దుకాణాలు శుభ్రంగా ఉంచాలన్నారు. రోజువారీగా మిగిలిన వ్యర్థాలను బయట పడేయకుండా కంపోస్ట్ తయారీ కేంద్రంలో వేయాలని సూచించారు.

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు

కెరమెరి, న్యూస్‌టుడే : సద్దుల బతుకమ్మ పండగ నిర్వహణ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని జడ్పీ సీఈవో(ప్రత్యేక అధికారి) లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మహిళలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక లైట్లు, తాగునీటి వసతులు కల్పించాలని సూచించారు. కుమురం భీం వర్ధంతి నేపథ్యంలో పోరు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. హట్టి శివారులో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను అంతర్జాలంలో నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీవో అమ్జద్ పాషా, ఎంఈఓ ఆడే ప్రకాష్, ఏపీఓ మల్లయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

చింతలమానెపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈమేరకు సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఎంపీడీవో ప్రసాద్, వైద్యాధికారి రాజ్‌కుమార్, ఏఈ ఉదయ్‌వీర్, ఏపీవో గోవర్ధన్ సింగ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల ఫోరం ఎన్నిక

బెజ్జూరు, న్యూస్‌టుడే : కుమురంభీం జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం కార్యవర్గం బుధవారం ఏర్పాటైంది. ఫోరం జిల్లా అధ్యక్షుడిగా మినాహజ్ అలీ, అసోసియేట్ అధ్యక్షుడిగా నేరేళ్ల రాజేశ్వర్, ఉపాధ్యక్షులుగా సంగోజు రవీందర్, దర్శనాల పద్మ, కార్యదర్శిగా ప్యాగ పోశం, సంయుక్త కార్యదర్శులుగా సుబ్బ సాయి కృష్ణ, బెజ్జంకి ప్రియాంక, కోశాధికారిగా వంశీ కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బోట్ల శ్వేతరాణి, పబ్లిసిటీ సెక్రటరీగా జి.ప్రేమలత, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కాండి కిరణ్‌కుమార్, ఆకుల శ్వేతలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫోరం రాష్ట్ర కన్వీనర్ సందీళ్ల బలరాం, ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు అశోక్‌ల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.


నూతన అధ్యక్షుడు మినాహజ్ అలీని సన్మానిస్తున్న సభ్యులు


వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న భారాస నాయకుడు శ్యాంరావు

సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు దోహదం

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సంపూర్ణ ఆరోగ్యానికి ఆహారపు అలవాట్లు, వ్యాయామంతోపాటు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని భారాస నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు అన్నారు. మోసం పంచాయతీలోని ఆరెగూడలో వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత యువతలో క్రీడానైపుణ్యం కలిగి ఉన్నప్పటికీ పోటీలు నిర్వహించకపోవడంతో క్రీడా ప్రతిభ బయటకు రావడం లేదన్నారు. ప్రతి గ్రామంలో పోటీలు నిర్వహించేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. భారాస నాయకులు ఎంఏ సలీం, కాసిపాక రాజు, ఆవుల రాజ్‌కుమార్ యాదవ్, నక్క మనోహర్, అంజన్న, సత్తయ్య, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.



గల్ఫ్ భరోసా.. విస్తరిస్తే బాగు

నిర్మల్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే దాదాపు 70 వేల మంది గల్ఫ్ దేశాలకు వెళ్లగా తాజాగా కొత్తతరం కూడా ఎడారి దేశాల బాట పడుతోంది. సాంకేతిక పరిజ్ఞానం లేని వారే ఆయా దేశాలకు వెళ్తుండటంతో వారంతా భవన నిర్మాణం, వ్యవసాయం వంటి పనుల్లో కుదురుతున్నారు. అక్కడి వాతావరణం, ఆహారం, తదితర పరిస్థితుల కారణంగా అనారోగ్యం, ఆపై మృత్యువాత పడుతున్న వారు కొందరైతే.. క్షణికావేశాలతో చేసే నేరాలతో జైళ్ల పాలవుతున్న వారు మరికొందరు. ఉమ్మడి జిల్లాలో ఏటా 30 నుంచి 40 మంది వరకు గుండెపోటు, మానసిక ఒత్తిడితో అనారోగ్యం కారణంగా చనిపోతుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబాలకు భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గల్ఫ్ దేశాల్లో ఏ కారణంతో చనిపోయినా బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. దీన్ని 7 డిసెంబరు 2023 నుంచి అమలు చేయాలని జీవో జారీ చేసింది. పరిహారం చెల్లించడానికి రూ.10.60 కోట్లు విడుదల చేసింది.

● రూ.5 లక్షల పరిహారంపై బాధిత కుటుంబాల వేడుకోలు..

మిగతా దేశాల్లో పనిచేసే కార్మికులకు వర్తింపజేయాలి

కేంద్రం ఇమిగ్రేషన్ యాక్టు-1983ను రూపొందించింది. ప్రస్తుతం రూ.5 లక్షల పరిహారం బహ్రెయిన్, కువైట్, ఒమాన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్‌లో మరణించిన వారికి వర్తింప చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో మిగతా దేశాల్లోని కార్మికులకూ అమలు చేయాలని బాధిత కుటుంబాల సభ్యులు కోరుతున్నారు. అఫ్గనిస్థాన్, జోర్డాన్, లెబనాన్, లిబియా, మలేసియా, సుడాన్, సౌత్ సుడాన్, సిరియా, యెమెన్, ఇండోనేషియా, థాయిలాండ్, సింగపూర్, ఇజ్రాయిల్, కాంబోడియా, రష్యా, ఉక్రెయిన్, మల్దీవులు, తదితర దేశాల్లో ఉన్న వారికి కూడా వర్తింప చేయాలని విన్నవిస్తున్నారు. మరణించిన సమయంలో గల్ఫ్ దేశాల్లో ఉద్యోగానికి సంబంధించి రుజువైన వర్క్ వీసా, ఉద్యోగ ఒప్పందం వంటి ఆధారాలు సమర్పించాలనే నిబంధనతో చాలామంది ఆందోళనలో ఉన్నారు. ఆ దేశాల్లో యజమానులు పెట్టే బాధలు భరించలేక పారిపోయిన వారు కొందరు ఉండగా.. శాశ్వత ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించిన ఏజెంట్లు సందర్శక (విజిట్) వీసాపై గల్ఫ్ దేశాలకు పంపించడంతో అక్కడ పనిలేక అక్రమ నివాసులుగా ఉన్నారు. వీరందరికీ ఈ పరిహారం వర్తించకపోవడంతో వందల సంఖ్యలో బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే అవకాశం కనిపించడం లేదు.

గల్ఫ్ దేశాలకు వెళ్లిన ఉమ్మడి జిల్లా వలస కార్మికులు : సుమారు 70 వేలు	వలస కార్మికుల కుటుంబ సభ్యులు : 2.50 లక్షలు	ఉమ్మడి జిల్లాలో 7 డిసెంబరు 2023 నుంచి ఇప్పటివరకు గల్ఫ్ దేశాల్లో చనిపోయిన వారి సంఖ్య : 32

ఇవీ నిబంధనలు.. అర్హత ప్రమాణాలు

- గల్ఫ్ దేశాలైన బహ్రెయిన్, కువైట్, ఒమాన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్‌లో మరణించిన వారికి వర్తింపు
- మరణించిన గల్ఫ్ బాధితుడి భార్య, పిల్లలు, తల్లిదండ్రులు ప్రాధాన్యక్రమంగా చూసి పరిహారం అందజేస్తారు
- గల్ఫ్ కార్మికుడి మరణ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు, ఉద్యోగం రుజువులు (వర్క్ వీసా, ఉద్యోగ ఒప్పందం) ధ్రువపత్రాలు సమర్పించాలి.
- గల్ఫ్‌లో మరణించిన కార్మికుడి కుటుంబ సభ్యులు పరిహారం కోసం కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించాలి. అర్హులైన దరఖాస్తుదారుల చెల్లుబాటు అయ్యే బ్యాంకు ఖాతా వివరాలు అందజేయాలి.
- గల్ఫ్‌లో కార్మికుడి మరణం ధ్రువీకరించిన తర్వాత కలెక్టర్ అర్హత గల కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లింపునకు ప్రొసీడింగ్ జారీ చేస్తారు.
- మృతి చెందిన తేదీ లేదా మృతదేహాన్ని స్వీకరించిన తేదీ నుంచి ఆరు నెలల లోపు కలెక్టరేట్‌లో దరఖాస్తు సమర్పించాలి
- మంజూరైన రూ.5 లక్షలు అర్హత ఉన్న కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాకు నేరుగా బదిలీ చేస్తారు.

ఇతర దేశాలకు వర్తింప చేయాలి :



స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసిమిత్ర కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు

గల్ఫ్‌తోపాటు ఇతర దేశాల్లో పనిచేసే కార్మికులు ఏదైనా కారణంతో మరణిస్తే వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా వర్తింప చేయాలి. సందర్శక వీసాపై వెళ్లి అక్కడ అక్రమంగా నివసిస్తూ మరణించిన బాధిత కుటుంబాలకు పరిహారం అందజేయాలి. గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సభ్యుల నియామకంలో విదేశాల్లో, స్వదేశంలో ఉన్న వారికి ప్రాతినిధ్యం కల్పించాలి. నకిలీ ఏజెంట్ల మోసాలను అరికట్టాలి. గల్ఫ్‌లో ఇబ్బందులు పడుతున్న వారికి, ఇక్కడున్న వారి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలి.



చంద్రపూర్‌లో సరిహద్దు జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమైన ఐజీ దిలీప్ పాటిల్

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించండి


● కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లా పోలీసు అధికారులతో మహారాష్ట్ర ఐజీ దిలీప్

బల్లార్ష, న్యూస్‌టుడే: త్వరలో మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సరిహద్దున ఉన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన పోలీసు అధికారులు సహకరించాలని నాగపూర్ ఐజీ దిలీప్ పాటిల్ అన్నారు. సరిహద్దు జిల్లాలైన కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లా పోలీసు అధికారులతో చంద్రపూర్‌లోని రేంజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్ర-తెలంగాణ రాష్ట్రాల అధికారుల సమన్వయంతో పనిచేస్తూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా తోడ్పాటు అందించాలన్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్, యావత్మాల్, గడ్చిరోలి జిల్లాలకు సరిహద్దున కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లాలు ఉన్నాయని, ఈ సరిహద్దున ఆరు చెక్‌పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఇవి కాకుండా ఇతర మార్గాల ద్వారా మద్యం, డబ్బు అక్రమంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వీటిని నిరోధించేలా రెండు రాష్ట్రాల అధికారులు సమన్వయంతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు. చెక్‌పోస్టు వద్ద సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంచాలని పేర్కొన్నారు. సరిహద్దు జిల్లాల ఆబ్కారీ, రెవెన్యూ అధికారుల సహాయ సహకారాలు అవసరమైతే వినియోగించుకోవాలని సూచించారు. [illegible]

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు చివరి తేదీ 15

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 15న చివరి తేదీ అని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.సుధాకర్, సమన్వయకర్త గంగాధర్ తెలిపారు. ఇంటర్ తత్సమాన అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు అధ్యయన కేంద్రంలో లేదా 73829 29703 నంబరులో సంప్రదించాలన్నారు.

ఒకరితో ఒకరు పోటీపడి..
కొలువు కొట్టి!



● ఆ కుటుంబాల నుంచి ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులు..

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: లక్ష్యం పెట్టుకుని ఇష్టంతో చదివితే విజయం సొంతమవుతుందని యువత నిరూపిస్తున్నారు. ఒకే కుటుంబం నుంచి అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు పోటీపడి మరీ చదివి ఇటీవలి డీఎస్సీ ఫలితాల్లో మెరిశారు. ఎంపికైన వారు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు.

టీచర్ల కుటుంబం..

కుమురంభీం జిల్లా సిర్పూర్(టి) మండలం లోనవెల్లి గ్రామానికి చెందిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు దానిష్ అహ్మద్‌కు ఇద్దరు కుమారులు. మహమ్మద్ హుజైఫా ఎస్జీటీగా, మహమ్మద్ హమ్జా తెలుగు పండిత్‌గా కొలువులు సాధించారు. 1-10వ తరగతి వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకొన్నారు. తండ్రిని ఆదర్శంగా తీసుకొని ఉద్యోగాలు సాధించినట్టు సోదరులిద్దరూ చెబుతున్నారు. వీరి పెద్దనాన్న మన్సూర్ అహమ్మద్ విశ్రాంత స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు కాగా ఇద్దరు బాబాయ్‌లు అనీష్ అహ్మద్, రయీస్ అహ్మద్‌లు సైతం స్కూల్‌అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.



సోదరులు మహమ్మద్ హుజైఫా, మహమ్మద్ హమ్జా

నాడు అక్క.. నేడు ఇద్దరు చెల్లెలు

కాగజ్‌నగర్ పట్టణం ద్వారకానగర్‌కు చెందిన వ్యవసాయ దంపతులు గోలెం కళావతి-శ్రీనివాస్‌కు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు. పెద్ద కుమార్తె సౌందర్య 2012 డీఎస్సీలో ఎస్జీటీ ఉపాధ్యాయురాలిగా కొలువు సాధించారు. మిగతా ఇద్దరు కుమార్తెలు సౌమ్య, కావ్య.. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ ముగ్గురు కూడా స్థానిక సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో 1-10 తరగతి వరకు చదువుకున్నారు. ఒకే కుటుంబం నుంచి ముచ్చటగా ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉపాధ్యాయులుగా కొలువులు సాధించారు. అక్కను స్ఫూర్తిగా తీసుకొని లక్ష్యంతో చదివినట్లు వారు తెలిపారు.



అక్కాచెల్లెలు సౌమ్య, కావ్య

పాతికేళ్లలోపే కొలువు పట్టేశారు!

ఒకే ఇంటి నుంచి ఇద్దరు సోదరులు ఎస్జీటీలుగా ఎంపికయ్యారు. ఆదిలాబాద్ పట్టణం దస్నాపూర్ కాలనీకి చెందిన ఆర్టీసీ కండక్టర్ శ్రీరాములు-పద్మ దంపతుల కుమారులు నర్సర్వార్ అభిషేక్-అభిలాష్‌లు. వీరి అక్క బావ మౌనిక-నరేష్‌లు సైతం ఉపాధ్యాయులే. అభిషేక్ 13వ ర్యాంకుతో ఓపెన్ కేటగిరిలో, అభిలాష్ 72వ ర్యాంకుతో రిజర్వేషన్ కేటగిరిలో ఉద్యోగాలు సాధించారు. **- న్యూస్‌టుడే, పాలనాప్రాంగణం**



తల్లిదండ్రులతో అభిషేక్, అభిలాష్



గోదావరి ఘాట్ వద్ద శివలింగానికి పూజలు



సామూహిక అక్షరాభ్యాసం



గోదావరిలో సూర్యనమస్కారం చేస్తున్న యువతి

బాసరకు ఆధ్యాత్మిక శోభ

● ఘనంగా మూలా నక్షత్ర వేడుకలు



కమలం పువ్వుతో భక్తురాలు



అక్షరాభ్యాసం అనంతరం పలక, బలపంతో చిన్నారి



ప్రత్యేక అలంకరణలో జ్ఞానసరస్వతి అమ్మవారు

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: మూలా నక్షత్ర శుభ సమయంలో జ్ఞాన సరస్వతి అమ్మవారి చెంత అక్షర శ్రీకారానికి వచ్చిన చిన్నారులతో బాసర ఆలయం, అక్షరాభ్యాస మండపాలు కళకళలాడాయి. ఆలయంలో వేద మంత్రాలు, గోదావరిలో పుణ్యస్నానాలు, భక్తుల మొక్కులతో బుధవారం ఆలయంలో ఆధ్మాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. వేకువ జామున 2 గంటలకు మూలా నక్షత్ర పూజ చేసి అక్షరాభ్యాసాలు మొదలుపెట్టారు. ఉదయం భక్తుల రద్దీ నెలకొన్నా మధ్యాహ్నానికి తగ్గింది. అమ్మవారి దర్శనం, పూజలు, అక్షరాభ్యాసాలకు వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటుచేశారు. పుణ్యస్నానాలు, కుంకుమార్చనలు, గంగమ్మ ప్రతిమ చుట్టూ ప్రదక్షిణలతో గోదావరి తీరం పులకించింది. సప్తమి ఘడియల్లో సరస్వతి అమ్మవారు కాళరాత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పూట అమ్మవారికి రాజోపచార, చతుష్షష్టి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో మహా మంగళహారతి పూజలు శాస్త్రోక్తంగా చేశారు. సుమారు 30 వేలకుపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. క్యూలైన్లలో ఉన్న చిన్నారులకు పాలు, బిస్కెట్లు అందజేశారు. పిల్లలకు పాలు పట్టేందుకు బాలింతలకు ఫీడింగ్ గదులు ఏర్పాటు చేశారు. 200 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. గతేడాదితో పోలిస్తే భక్తుల తాకిడి తగ్గింది. వీఐపీ పాసులను నిలిపివేయడంతో హడావుడి లేకుండా క్యూలైన్ ముందుకు సాగింది. భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆన్‌లైన్‌లో టికెట్లను తీసుకున్న వారికి ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో అక్షరాభ్యాసాలు చేయించారు. ఆలయంలోని మహాకాళి దర్శనం కోసం వెళ్లే మార్గంలో బారికేడ్లు ఏర్పాటుచేయడంతో భక్తులు కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

సరస్వతి అమ్మవారిని ఎంపీ నగేశ్, ముథోల్, సిర్పూర్(టి) ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబు, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, భారాస నాయకురాలు రమాదేవి, తెలంగాణ సినీ నటుడు రోషం బాలు, ఆయా పార్టీల నాయకులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చెందిన అతిథి గృహాలు అధికారులు, వీఐపీలకు కేటాయించడంతో సాధారణ భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత సంవత్సరం ఎదురైన ఇబ్బందుల దృష్ట్యా చాలా మంది భక్తులు బాసరకు రాలేదు. ఆలయ పక్షాన వసతి గదులు అందుబాటులో లేనందున ప్రైవేట్ లాడ్జిల నిర్వాహకులు ఇష్టం వచ్చిన ధరలు వసూలు చేశారు.

తగ్గిన అక్షరాభ్యాసాలు

గతేడాదితో పోలిస్తే భక్తుల రద్దీతో పాటు అక్షరాభ్యాసాలు కూడా తగ్గాయి. రూ.1000 ప్రత్యేక అక్షరాభ్యాసాలు 1621, రూ.150 అక్షరాభ్యాసాలు 609 నిర్వహించారు. ఆన్‌లైన్‌లో 200 మంది చిన్నారులు అక్షరాభ్యాసాల టికెట్లు కొనుగోలు చేశారని ఆలయ ఈవో విజయరామారావు చెప్పారు. అక్షరాభ్యాసాలకు 2-4 గంటల సమయం పట్టింది. ఆలయానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చింది. గత ఏడాది 2739 అక్షరాభ్యాసాలు జరిగాయి. రూ.35 లక్షల ఆదాయం సమకూరింది.



బందోబస్తు పర్యవేక్షిస్తున్న భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్



దర్శనానికి వస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్, తదితరులు

వరి పొలంలో పులి కళేబరం

బల్లార్ష, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా సావిలీ అటవీ రేంజి పరిధి డోంగర్‌గావ్ గ్రామ పరిసరాలలోని వరి పొలంలో బుధవారం పులి కళేబరాన్ని రైతులు గుర్తించారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారమివ్వగా. . వారు కళేబరాన్ని చంద్రపూర్‌కు తరలించారు. చనిపోయింది ఆడ పులి అని, ఏడాదిన్నరేళ్ల వయసు ఉంటుందని పరీక్షల తర్వాతే మృతికి గల కారణాలు తెలుస్తాయని సావిలీ అటవీ క్షేత్ర అధికారి వినోద్ దుర్వే తెలిపారు.



పంట నష్టపరిహారం మంజూరు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం : ఉమ్మడి జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వరుసగా కురిసిన వర్షాలతో వాగులతో పాటు సరిహద్దులో ఉన్న పెన్‌గంగ ఉద్ధృతి కారణంగా పలు గ్రామాల్లో పంటలు నీట మునిగి రైతులు పంటలను నష్టపోయారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు గ్రామాల వారీగా సర్వే చేసి ప్రతిపాదనలు పంపించారు. ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందించనున్నారు.

జిల్లా	ఎకరాలు	రైతులు	పరిహారం (రూ.కోట్లలో)
ఆదిలాబాద్	3096	2041	3.09
కుమురం భీం	2692	1371	2.69
మంచిర్యాల	598	447	0.59

విధులకు వెళుతుంటే విధి వంచించింది

● జాతీయ రహదారిపై చెట్టును ఢీకొన్న కారు
● తండ్రి, కుమారుడి దుర్మరణం.. తీవ్రంగా గాయపడ్డ తల్లీకుమార్తెలు

లోకేశ్వరం/నర్సాపూర్(జి): న్యూస్‌టుడే: తెల్లవారుజామున లేచి విధులకు హాజరుకావాలన్న ఆలోచనతో హడావుడిగా భార్యాపిల్లలతో కారులో బయలుదేరిన విద్యుత్తు ఉద్యోగి కుటుంబాన్ని విధి వంచించింది. కారు ముందు టైరు పగిలి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓ చెట్టును ఢీకొట్టిన ఘటనలో తండ్రి, కుమారుడు దుర్మరణం పాలవగా తల్లి, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. నిర్మల్-భైంసా జాతీయ రహదారిలో నందన్ సమీపంలో బుధవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నర్సాపూర్(జి) ఎస్సై హన్మాండ్లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లోకేశ్వరం మండలం మన్మద్ వాసి సంగం సురేశ్(28) మన్మద్ విద్యుత్తు ఉపకేంద్రంలో ఆపరేటరుగా పనిచేస్తున్నారు. మంగళవారం భార్య ప్రియాంక, కుమారుడు సాయివర్షిక్, కూతురు తనిష్కలతో కలిసి అత్తగారి ఊరైన బోథ్ మండలం కుచులాపూర్ వెళ్లారు. రాత్రికి అక్కడే ఉన్నారు. బుధవారం విధులకు హాజరయ్యేందుకు ఉదయమే భార్యాపిల్లలతో తన సొంత కారులో మన్మద్ బయలుదేరారు. ఉదయం 9 గంటల సమయంలో నర్సాపూర్(జి) మండలం నందన్ దాటగానే కారు ముందు టైరు పగిలింది. అతివేగం కారణంగా అదుపుతప్పి రోడ్డు పక్కనే గల చెట్టును బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ కుమారుడు సాయివర్షిక్(6) అక్కడికక్కడే మరణించగా తీవ్రంగా గాయపడ్డ సురేశ్, భార్య ప్రియాంక, కూతురు తనిష్కలను స్థానికులు అంబులెన్సులో నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మార్గమధ్యలోనే సురేశ్ మృతిచెందినట్లు నిర్ధారించారు. తీవ్ర గాయాల పాలైన ప్రియాంకకు ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించారు. తనిష్క నిర్మల్‌లో చికిత్స పొందుతోంది. సురేశ్ అత్త మచ్చెర్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.



సంగం సురేశ్



సాయివర్షిక్



నిర్మల్-భైంసా జాతీయ రహదారిలో నందన్ సమీపంలో రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టిన కారు

మన్మద్‌లో విషాదఛాయలు..

అందరితో కలుపుగోలుగా ఉండే సురేశ్‌తో పాటు చిరునవ్వులు చిందించే సాయివర్షిక్‌లు మృతి విషయం తెలియగానే మన్మద్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న గ్రామస్థులు ప్రమాద తీరును చూసి చలించారు.

పట్టగొలుసు మింగిన చిన్నారి.. తప్పిన ప్రాణాపాయం

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : ఏడు నెలల చిన్నారి పట్టగొలుసు మింగటంతో గొంతులో ఇరుక్కొని ప్రాణాపాయంగా మారగా ఆదిలాబాద్ రిమ్స్ వైద్యులు చాకచక్యంగా బయటకు తీసి ప్రాణాలను కాపాడారు. గుడిహత్నూర్‌కు చెందిన ధ్రుతి(7 నెలలు) కాలికి ఉన్న వెండి పట్టగొలుసును నోట్లో పెట్టుకోవడంతో బుధవారం గొంతులో ఇరుక్కుపోయింది. కుటుంబ సభ్యులు పాపను రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేసే మామిడి హేమంతరావు(ఈఎన్‌టీ) చాకచక్యంగా ఎండోస్కోపి చేసి గొంతులో ఇరుక్కున్న పట్టగొలుసును బయటకు తీశారు. రిమ్స్ సంచాలకుడు జైసింగ్ రాఠోడ్ వైద్యుడు హేమంతరావును అభినందించారు.



ప్రాణాపాయం తప్పిన చిన్నారి ధ్రుతి



ఏడు నెలల చిన్నారి గొంతులో ఇరుక్కున్న వెండి పట్టగొలుసు